

తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి

- పట్టభద్రుల పక్షాన నిలబడే వ్యక్తి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి బుద్ధి చెప్పాలి
- బ్లాక్‌మెయిలర్‌ను గెలిపిస్తే ప్రజాస్వామ్యానికి చేటు
- తొర్రూరులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, మే 19: పట్టభద్రుల పక్షాన నిలబడి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసే సత్తా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఉన్నదని, ఎన్నికల్లో ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరులోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికీ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వలేదని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు ఇచ్చి 30వేల ఉద్యోగాలు కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అలాంటి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి మీడియా ముసుగులో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ అడ్డగోలు అక్రమాలు చేశాడని, అతడిని గెలిపిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకే కలంకంగా మారుతుందన్నారు. విద్యావంతులైన పట్టభద్రులంతా పోరాడే పటిమ ఉన్న రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా బీఆర్‌ఎస్ శ్రేణులు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ నెల 22న తొర్రూరులో నిర్వహించనున్న పట్టభద్రుల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ తూర్పాటి చినఅంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పాలకుర్తి నియోజకవర్గ సమన్వయకర్త పానుగోటి సోమేశ్వరరావు, తొర్రూరు, పాలకుర్తి, రాయపర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, పెద్దవంగర మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పట్టభద్రులు, బీఆర్‌ఎస్ శ్రేణులు

# రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- పశ్చిమలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం

హనుమకొండ, మే 19: పట్టభద్రులు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి కాకతీయ కాలనీలోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నివాసంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు, కాకతీయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థి నాయకులు, పరిశోధకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రశ్నించడంతోపాటు పరిష్కరించే దిశగా ఉన్నత విద్యావంతుడు, మేధావి అయిన రాకేశ్‌రెడ్డికి విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, న్యాయవాదులు, అన్నిసంఘాల మద్దతు అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వ ర్లు, మర్రి యాదవరెడ్డి, ప్రముఖ న్యాయవాదులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, వద్దిరాజు గణేశ్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకులు జెట్టి రాజేందర్, కొమురయ్య, విజయ్, సీనియర్ నాయకులు జోరిక రమేశ్, పోలేపల్లి రామ్మూర్తి, శోభన్, రజనీకాంత్ పాల్గొన్నారు.

# సాంకేతిక లోపంతో నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

## ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



స్టేషన్‌మాస్టర్‌తో ప్రయాణికుల వాగ్వాదం

కమలాపూర్, మే 19: ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రెండు గంటలకుపైగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సాయంత్రం 6 గంటలకు, అహ్మదాబాద్ నుంచి చెన్నై వెళ్లాల్సిన నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును 6.50 గంటలకు ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. రెండు రైళ్లకు సంబంధించిన ఇంజిన్లను మార్చేందుకు 2గంటలకుపైగా సమయం పట్టడంతో స్టేషన్‌లో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. తాగునీరు సైతం లేక ఇబ్బందులు పడుతున్నామని స్టేషన్ మాస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8.10కి నవజీవన్, 8.20 గంటలకు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పంపించి రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



సరైన నిర్వహణ లేని టేకుమట్ల మండలం ఆరెపల్లిలోని శ్మశాన వాటిక

# ప్రగతి తప్పిన పల్లెలు

- నిర్వహణ గాలికొదిలేసిన రాష్ట్ర సర్కారు
- పట్టించుకోక అస్తవ్యస్తమైన పల్లె పాలన
- కేసీఆర్ పాలనలో పక్కాగా పనులు

## కేసీఆర్ హయాంలో ప్రతి నెలా నిధులు

గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన పనులను పూర్తి చేసేందుకు జనాభాకనుగుణంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నెలా నిధులు ఇచ్చింది. వీటితో అన్ని గ్రామాల్లో వసతుల కల్పన పెరిగింది. రోడ్లు, డ్రైనేజీలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలతోపాటు పల్లె ప్రకృతి వనాలు, ఎక్కడ చూసినా చెట్లతో ఊళ్లన్నీ పచ్చగా ఉండేవి. పట్టణాలకు, నగరాలకు దీటుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను నిలిపివేసి కొత్తగా పనులు చేయకపోగా గతంలో అభివృద్ధి చేసిన వాటి నిర్వహణను మరిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన డిసెంబర్ నుంచి ఇప్పటివరకు గ్రామపంచాయతీలకు అభివృద్ధి నిధులు విడుదల చేయలేదు.




గ్రామపంచాయతీ కార్యాలయం

## కాంగ్రెస్ రాకతో నిలిచిన నిధులు

కేసీఆర్ పాలనలో ఎటుచూసినా పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలతో చూడముచ్చటగా ఉన్న పల్లెల్లో ప్రగతి కళ తప్పింది. పల్లెల సమగ్రాభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన 'పల్లె ప్రగతి'ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా ఇవ్వాల్సిన నిధులను ఆపివేసింది. అధికారుల పాలనలో పల్లెలు ఇప్పుడు అస్తవ్యస్తంగా మారాయి. పారిశుధ్య నిర్వహణ గాలికి వదిలేశారు. కేసీఆర్ ప్రభుత్వం పల్లెల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు, హరితహారంతో పెరిగిన పచ్చదనం ఇప్పుడు పట్టించుకునే వారు లేక మోడువారుతున్నాయి. డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల్లోనూ సరైన నిర్వహణ లేక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

### నాడు గ్రామాలన్నీ పరిశుభ్రం

పల్లెలు నిత్యం పరిశుభ్రంగా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతిని అమలు చేసింది. 2019 సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 5 వరకు మొదటి విడత.. 2020 జనవరి 2నుంచి 12 వరకు రెండో విడత.. 2020 జూన్ 1నుంచి 8 వరకు మూడో విడత '2021 జూలై 1 నుంచి 10 వరకు నాలుగో విడత 2022 మే 20నుంచి జూన్ 5 వరకు ఐదో విడత పల్లె ప్రగతి నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కలిపి 1687 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పల్లె ప్రగతి కోసం రూ.42.05 కోట్లు ఇచ్చింది. ఈ నిధులు ఇప్పుడు ఆగిపోయాయి. దీంతో పల్లెల అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రగతి నుంచి పట్టింపులేని విధంగా పల్లెల పరిస్థితి తయారైంది. పల్లెలను స్వచ్ఛత కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించింది. ప్రతి ఊరూ స్వచ్ఛంగా ఉండాలని, నిరంతరం పారిశుధ్య నిర్వహణ ఉండాలనే లక్ష్యంతో పారిశుధ్య కార్మికుల వేతనాన్ని రూ.8,500లకు పెంచింది. ప్రతి ఇంటికీ చెత్త బుట్టలను పంపిణీ చేసి గ్రామాలు శుభ్రంగా ఉండేలా ప్రణాళిక రూపొందించింది. ప్రతి గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ట్రాలీలో చెత్తను ఊరి అవతలికి తరలించింది. రోజువారీగా సేకరించే చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి దాన్ని కంపోస్టు ఎరువుగా మార్చే ప్రక్రియను మొదలుపెట్టేలా వీటిని నిర్మించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డంపింగ్ యార్డుల నిర్మాణం పూర్తయ్యింది. ఆరు జిల్లాల్లో కలిపి 1,688 గ్రామ పంచాయతీలు ఉంటే అన్నింటిలోనూ డంపింగ్ యార్డుల నిర్మాణం చేపట్టారు. కంపోస్టు ప్రక్రియను మొదలుపెట్టారు. దీంతో ఊర్లన్నీ నిత్యం పరిశుభ్రంగా ఉండేవి.

*గ్రామాలు అభివృద్ధి చెంది పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరియాలని కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతికి శ్రీకారం చుట్టగా, కాంగ్రెస్ సర్కారు దాన్ని గాలి కొదిలేసింది. పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను ఆపేయడంతో పల్లె పాలన అస్తవ్యస్తంగా మారింది. నాడు పల్లె ప్రగతికి ప్రతి నెలా నిధులు విడుదల చేయడంతో ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు ప్రజలకు సద్వినియోగమయ్యాయి. నేడు సరైన నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోయాయి. కేసీఆర్ పాలనలో పక్కాగా పనులు జరుగగా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పల్లెల ప్రగతి ఎక్కడికక్కడే నిలిచిపోయింది.*

*- వరంగల్, మే 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**ప్రతి నెలా పల్లె ప్రగతి నిధులు**

| జిల్లా | ఏటా (రూ.కోట్లు) |
|---|---|
| హనుమకొండ | 45 |
| వరంగల్ | 75 |
| మహబూబాబాద్ | 80 |
| జనగామ | 60 |
| భూపాలపల్లి | 55 |
| ములుగు | 50 |

2019 నుంచి 2023 వరకు..

**డంపింగ్ యార్డులు**

| జిల్లా | గ్రామ పంచాయతీలు |
|---|---|
| హనుమకొండ | 208 |
| వరంగల్ | 323 |
| మహబూబాబాద్ | 461 |
| జనగామ | 281 |
| భూపాలపల్లి | 241 |
| ములుగు | 174 |



ఐనవోలు మండలం కక్కిరాలపల్లి పల్లె ప్రకృతి వనంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

# ధాన్యం.. దైన్యం

## దిక్కుతోచని స్థితిలో రైతు

- 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు
- గన్నీ సంచులు ఇవ్వని నిర్వాహకులు
- వెంటనే తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని అన్నదాతల డిమాండ్



ఏటూరునాగారం: కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

ఏటూరునాగారం/ములుగు రూరల్/వెంకటాపూర్, మే 19: అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేస్తోంది. 15 రోజులుగా పడిగాపులు గాసినా తేమ పేరుతో వడ్లు కొనకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. వడ్లకు మొలకలు వచ్చాయి. దీంతో రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. వరుస వర్షాలతో ఏటూరునాగారం, ములుగు, వెంకటాపూర్ మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. వడ్లపై కప్పిన టార్పాలిన్‌పై నీటిని ఎత్తిపోయడం, మళ్లీ కప్పుకోవడం రైతుకు దినచర్యగా మారింది. లారీల కొద్దీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిపోయింది. కనీసం వడ్లు నింపుకునేందుకు గన్నీ సంచులూ ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన వడ్లను కొనుగోలు చేయడంతో పాటు పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా వర్షాలతో పలు చోట్ల చేతికందే దశలో ఉన్న వరి పంట నేలమట్టమైంది.



వెంకటాపూర్ మండలంలోని వెల్తుర్లపల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి: మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి: తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. పాలకుర్తి మండలం విస్నూరు, తొర్రూరులోని కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఐకేపీ కేంద్రాలకు మూడు నెలల నుంచి ధాన్యం వస్తున్నా కొనుగోలు చేయకుండా సర్కారు నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, విస్నూరు ఎంపీటీసీ మాటూరి యాకయ్య, నాయకులు రాపాక రంగయ్య, సోమన్న, మాజీ సర్పంచ్ నకీర్త యాకయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, కార్యదర్శి బెజాడి సురేశ్, సోమేశ్వర్‌రావు, భద్రయ్య ,బాలగాని నాగరాజు, అడ్డూరి భూపాల్‌రావు, అనిల్, చలపతిరావు పాల్గొన్నారు.



ధాన్యంపై కప్పిన టార్పాలిన్ నుంచి నీటిని తొలగిస్తున్న కూలీలు



ములుగు మండలం బండారుపల్లిలో నేలమట్టమైన వరి పంట

# మనుమళ్ల చేతిలో తాత హతం

- ఆస్తి విషయంలో తరచూ తగాదాలు
- పాత కక్షలను మనసులో పెట్టుకొని హత్య
- హసన్‌పర్తిలో విషాదం



సారయ్య(ఫైల్)

హసన్‌పర్తి, మే 19 : మనుమళ్లు తాతను వాకింగ్ స్టాండ్‌తో కొట్టి చంపిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జల్లి సారయ్య(80)కు నలుగురు సంతానం. అందులో ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ కుమారుడు చిన్నతనంలోనే చనిపోయాడు. పెద్ద కుమారుడు రమేశ్‌తోపాటు ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. రమేశ్‌కు భార్య రమాదేవితోపాటు కుమారులు శశికుమార్(19), సాయికృష్ణ(22) ఉన్నారు. రమేశ్ గతంలోనే చనిపోయాడు. ఈ నేపథ్యంలో ఇంటి స్థలం, నల్లా నీళ్లు, ఆస్తుల విషయంలో సారయ్య, కోడలు రమాదేవి, ఇద్దరు మనుమళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 6 గంటలకు నల్లా నీళ్లు పట్టుకునే విషయంలో మళ్లీ గొడవ జరిగింది. పాత కక్షలను మనసులో పెట్టుకొని సారయ్యను కోడలు గట్టిగా పట్టుకోగా మనుమళ్లు వాకింగ్ స్టాండ్‌తో తాత తల, చేయిపై బలంగా కొట్టి పారిపోయారు. దీంతో సారయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సారయ్య కూతురు ల్యాగ తిరుమల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# పేద కుటుంబానికి పెద్ద కష్టం

- ఊపిరితిత్తుల వ్యాధితో తల్లి మృతి
- కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమారుడు సతీశ్
- వైద్యం చేయించే స్థోమత లేని కుటుంబం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు
- దాతలు ఆదుకోవాలని తండ్రి వేడుకోలు



హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న సతీశ్

నర్సింహులపేట మే 19: విధి వెక్కిరించింది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. తల్లి ఊపిరితిత్తుల (లంగ్స్) వ్యాధితో మృతి చెందింది. ఓ వైపు ఆమెను కాపాడుకుంటున్న సమయంలో 28 ఏళ్ల కుమారుడికి కిడ్నీ వ్యాధి సోకడంతో వైద్య ఖర్చులకు చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నది ఆ కుటుంబం. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన తాళ్ల ప్రమీల– సోమన్నకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కూలీకి పోతేనే పూట గడుస్తుంది. అంతా సాఫీగా సాగుతున్న కుటుంబంలో పిడుగులాంటి వార్త వినిపించింది. ప్రమీలకు ఊపిరితిత్తుల(లంగ్స్) వ్యాధి సోకింది. నాలుగేళ్లపాటు చికిత్స కోసం కుటుంబమంతా కష్టపడి సుమారు రూ. 8లక్షల వరకు ఖర్చు చేసి వైద్యం చేయించారు. అయినా ప్రమీల ఆరోగ్యం రోజురోజుకూ మరింత క్షీణిస్తున్న సమయంలో మరో కష్టం వచ్చి పడింది. 28 ఏళ్ల కుమారుడు సతీశ్‌కు యూరిన్ ఇన్ఫెక్షన్ వచ్చింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో వైద్యం చేయించుకున్నా నయం కాక పోగా కిడ్నీలు దెబ్బతినడంతో (డయాలసిస్) మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స చేయించుకుంటున్న సమయంలో ఈనెల 9న ప్రమీల అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి చనిపోయిన బాధ ఓ వైపు.. తన ఆరోగ్యం కోసం డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు మరోవైపు.. నాలుగు నెలలుగా సతీశ్‌కు రూ.6లక్షల వరకు వైద్యం కోసం ఖర్చు చేశారు. ఇప్పటికీ నిమ్స్‌లో రోజూ రెండు ఇంజెక్షన్లకు రూ.12 వేలు, ఇతర మందులకు రూ. 8 వేల వరకు ఖర్చు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు రూ.35 వేల వరకు ఆర్థిక సాయం చేశారు. కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే తపనతో ఉన్నదంతా ఖర్చు పెట్టి మరీ వైద్యం చేయిస్తున్నారు. రోజుకు రూ.20 వేలకు పైగా ఖర్చవుతున్నదని, తమ శక్తి సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని, దాతలు ముందుకు వచ్చి సాయం చేసి తన కొడుకును కాపాడాలని తండ్రి సోమన్న వేడుకుంటున్నాడు. సాయం చేయాలనుకునే వారు ఫోన్‌పే 9505674125 లేదా, గూగుల్‌పే 7569042894 నంబర్లకు డబ్బులు పంపించాలని కోరుతున్నారు.